# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)

## దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ

**పత్రికా ప్రకటన**

**జూన్ 10, 2011**

# రమన్ ప్రభుత్వ ఫాసిస్టు పాలనకూ, పాశవిక నిర్బంధానికీ జవాబే పీఎల్‌జీఏ ఇటీవల జరిపిన ఎదురుదాడులు!

## ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను వెంటనే ఆపెయ్యాలి!

## బస్తర్‌లో సైన్యం మోహరింపునూ, శిక్షణ పేరుతో తలపెట్టిన భారీ భూముల కబ్జానూ వ్యతిరేకించండి!

దండకారణ్యంలో మే నెల నుండి పీఎల్‌జీఏ వరుసగా నిర్వహిస్తున్న ఎత్తుగడల ఎదురుదాడులతో దోపిడీ పాలకవర్గాలు కలవరపడ్తున్నాయి. వాళ్లతో గొంతు కలుపుతున్న కార్పొరేట్ మీడియా ప్రతినిధులు కూడా బాగా గగ్గోలు పెడుతున్నారు. 'మావోయిస్టుల దాడులు అకస్మాత్తుగా పెరిగిపోయాయ'ంటూ ఎంతో విచారం ప్రకటిస్తున్నారు! ప్రకాశ్ సింగ్, అర్నాబ్ గోస్వామి, శేఖర్ గుప్తా, చందన్ మిత్రా, పీ.వీ. రమణ వంటి దళారీ మేధావులంతా టీవీ ఛానెళ్లలో గావు కేకలు పెడుతున్నారు. మావోయిస్టులను ఎదుర్కోవడానికి ప్రభుత్వం వద్ద ధీటైన వ్యూహం లేదని ఒకరంటే, అసలు ప్రభుత్వానికి సంకల్పమే లేదని మరొకరంటున్నారు. కానీ వాళ్లలో ఎవరూ కూడా స్వభావరీత్యానే ప్రభుత్వ నిర్బంధ విధానాలకు తార్కిక ఫలితమే ఇదని ఒప్పుకోవడానికి సిద్ధంగా లేరు!

మరోవైపు దండకారణ్య ప్రజానీకం పీఎల్‌జీఏ నిర్వహిస్తున్న ఈ ఎదురుదాడులను స్వాగతిస్తున్నారు. ముఖ్యంగా, దాదాపు గత రెండేళ్లుగా సాగుతున్న ఆపరేషన్ గ్రీన్‌హంట్‌లో ప్రభుత్వ సాయుధ బలగాలు సాగించిన బీభత్సకాండ మూలంగా ఎవరి ఇండ్లు కాల్చెయ్యబడ్డాయో, ఎవరి కుటుంబ సభ్యులు ప్రాణాలు కోల్పోయారో, ఎవరైతే తమ సర్వస్వం కోల్పోయారో, ఎవరి తల్లుళ్లు చెల్లెళ్లు అవమానాలకు గురయ్యారో, ఎవరి పిల్లలు పోలీసుల పాశవికతకు గురయ్యారో, ఎవరి బంధువులు చీకటికొట్టాల్లో మగ్గిపోతున్నారో అలాంటి వాళ్లంతా ఈ ఎదురుదాడుల పట్ల తమ సంతోషాన్ని ప్రకటిస్తున్నారు.

గత నెల 17న రాత్రి దంతెవాడ జిల్లాలోని బోడగూడెం దగ్గర మా పీఎల్‌జీఏ దళం సీఆర్‌పీఎఫ్‌కు చెందిన ఒక వాహనాన్ని మందుపాతరతో పేల్చేయగా ఏడుగురు కిరాయి జవాన్లు చని పోయారు. ఒక జవాను గాయపడ్డాడు.

మే 19న గడ్చిరోలి (మహారాష్ట్ర) జిల్లాలోని నారుగొండ దగ్గర మా పీఎల్‌జీఏ చేసిన ఒక బ్రహ్మాండమైన దాడిలో చిన్నా వెంట అనే ఒక క్రూర మృగం (సీ–60 బలగాల కమాండర్) చచ్చాడు. ఈ దాడిలో మా కామ్రేడ్స్ ఇద్దరు ప్రాణత్యాగం చేశారు. చిన్నా వెంట అంటే బీభత్సానికి మారు పేరు. గడ్చిరోలి జిల్లాలో ఇతని దౌర్జన్యానికీ, జులుంకూ గురి కాని గ్రామం లేదా కుటుంబం ఒక్కటైనా లేదంటే ఆశ్చర్యమేమీ లేదు. కొట్టడం దగ్గరి నుండి మహిళలపై అత్యాచారాలు, బూటకపు ఎన్‌కౌంటర్లు, దోపిడీలు, లంచాలు వగైరా ఆయనకు నిత్యకృత్యాలు. ఇతని చావు వార్త వినగానే మొత్తం జిల్లా అంతటా పండుగ వాతావరణం నెలకొంది.

మే 23న, మహత్తర నక్సల్బరీ తిరుగుబాటు 44వ వార్షికోత్సవం నాడు రాయపూర్ జిల్లా (గరియాబంద్ పోలీసు జిల్లా)లో ఏఎస్‌పీ రాజేష్ పవార్ సహా తొమ్మిది మంది పోలీసుల్ని మా పీఎల్‌జీఏ ఒక సాహసోపేతమైన ఆంబుష్‌లో హతమార్చింది. ఈ ఏఎస్‌పీ ఆదివాసీ యువకుల్ని నయానా భయానా లొంగదీసుకొని లేదా ప్రలోభాలకు గురి చేసి ఇన్‌ఫార్మర్లుగా తయారు చేసుకునే వాడు. వాళ్ల నుండి వచ్చే సమాచారంతో దాడులు చేసి విప్లవోద్యమానికి నష్టం చేసే కుట్రలో ఇతనిది ప్రముఖ పాత్ర. న్యాయమైన వుద్యమాలకు వ్యతిరేకంగా దాడులకు, కుట్రలకు పాల్పడే వాళ్లను ప్రజలెన్నటికీ క్షమించరు.

నిన్న 9వ తేదీన వుదయం ఏడు గంటలకు పీఎల్‌జీఏ ఎర్ర యోధులు నారాయణపూర్ జిల్లాలోని ఝూరఘాటీలో వున్న సీఏఎఫ్ (ఛత్తీస్‌గఢ్ సాయుధ బలగం) క్యాంపుకు చాలా సమీపంలో ఒక పోలీసు బృందంపై దాడి చేసి ఐదుగురిని హతమార్చారు. వాళ్ల ఆయుధాలన్నీ స్వాధీనం చేసుకున్నారు. గమనించాల్సిన విషయం ఏమిటంటే ఆపరేషన్ గ్రీన్‌హంట్ రెండో దశలో భాగంగా ఈ క్యాంపును ఈ మధ్యనే ఏర్పాటు చేశారు. మళ్లీ నిన్న రాత్రే దంతెవాడ జిల్లాలోని కటేకళ్యాణ్‌కు సమీపంలో మా ప్రజాసైనికులు మందుపాతరతో ఒక పోలీసు వాహనాన్ని పేల్చేయగా అందులో ఏడుగురు ఎస్‌పీవోలు సహా 10 మంది పోలీసులు మరణించారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. కొన్ని ఆయుధాలు పీఎల్‌జీఏ వశమయ్యాయి.

ఇవే కాకుండా ఈ మధ్యన ఛింద్‌గఢ్, తోంగ్‌పాల్, బాందే, గుడ్సె మొదలైన చోట్లలో చిన్న, మధ్య రకం చర్యల్ని నిర్వహించి పీఎల్‌జీఏ కొంతమంది దుర్మార్గులైన ఎస్‌పీవోలనూ, పోలీసులనూ మట్టుబెట్టింది.

### ఈ ఎదురుదాడులు ఎందుకు జరుగుతున్నాయి?

నిజానికి దేశ ప్రజానీకానికి వ్యతిరేకంగా అన్యాయమైన యుద్ధం – ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను ప్రారంభించి, ప్రస్తుతం రెండో దశను కొనసాగిస్తున్న సోనియా–మన్మోహన్‌సింగ్–చిదంబరం ముఠా, రమన్‌సింగ్, శేఖర్‌దత్ మొదలైన దోపిడీ పాలకులే ఈ దాడులకు బాధ్యులు. ఇందులో భాగంగా అవిభాజిత బస్తర్ ప్రాంతంలో పోలీసులు, పారామిలిటరీ, ఎస్‌టీఎఫ్, కోబ్రా, ఎస్‌పీవో, కోయ కమాండోల అత్యాచారాలు,

దౌర్జన్యాలు ఎంతగానో పెరిగిపోయాయి. చింతల్‌నార్ ప్రాంతంలోని నాలుగు గ్రామాలలో – మోర్‌పల్లి, తిమ్మాపురం, పులాన్‌పాడు, తాడిమెట్లలలో ప్రభుత్వ సాయుధ బలగాలు సాగించిన బీభత్సకాండ దీనికి ఒక తాజా వుదాహరణ. మార్చ్ 11 నుండి 16 వరకు సాగిన ఈ బర్బర హింసాకాండలో దాదాపు 300 ఇండ్లను కాల్చివేశారు. ముగ్గురు గ్రామీణులను హత్య చేశారు. ఆరుగురు మహిళలపై సామూహిక అత్యాచారాలకు పాల్పడ్డారు. ఇద్దరిని మాయం చేశారు. వేలాది క్వింటాళ్ల ధాన్యాన్ని కాలబెట్టారు. ఈ మొత్తం విధ్వంసాన్ని పూర్తిగా అంచనా వెయ్యడం నిజానికి సాధ్యం కూడా కాదు.

ఏప్రిల్ 19వ తేదీన నారాయణపూర్ జిల్లాలోని చినారీ గ్రామంలో పద్నాలుగేళ్ల పిల్లవాడైన రజ్ఞూ సలాంను పోలీసులు, పారామిలిటరీ బలగాలు కాల్చి చంపి ఎన్‌కౌంటర్ కథ అల్లాయి. దానికి ముందు, మార్చ్ 23న ఇదే జిల్లాలోని కుల్లెనార్ గ్రామంలో జరిగిన ఒక ఎన్‌కౌంటర్ సందర్భంగా రమేష్, ప్రభాకర్ అనే ఇద్దరు గెరిల్లాలను సజీవంగా పట్టుకొని చిత్రహింసలకు గురిచేసి హత్య చేశారు. దక్షిణ బస్తర్‌లో బెల్లంనేంద్ర, విమలగూడెం అనే గ్రామాలపై సర్కారీ బలగాలు హింసాకాండకు పాల్పడ్డాయి. రాజనాంద్‌గాం, కాంకేర్ జిల్లాల నుండి దంతెవాడ దాకా వందలాది మంది ఆదివాసులను అరెస్టు చేసి చిత్రహింసలకు గురి చెయ్యడం, తప్పుడు కేసుల్లో ఇరికించి జైళ్లల్లోకి తోసెయ్యడం పరిపాటిగా మారింది. ఒక్క మాటలో చెప్పాలంటే దండకారణ్యంలో ప్రభుత్వ బలగాల దౌర్జన్యకాండ, బీభత్సకాండలు నిరంతరాయంగా కొనసాగుతున్నాయి. ఇటీవల పీఎల్‌జీఏ నిర్వహించిన ఎదురుదాడులకు ఈ నేపథ్యం వుంది.

ఆపరేషన్ గ్రీన్‌హంట్ లక్ష్యం దేశంలో అనేక ప్రాంతాల్లో, ముఖ్యంగా ఆదివాసీ ప్రాంతాల్లో సాగుతున్న మావోయిస్టు వుద్యమాన్ని సమూలంగా నిర్మూలించడం, ఈ ప్రాంతాలను బడా, విదేశీ పెట్టుబడిదారుల విచ్చలవిడి దోపిడీకి నెలవుగా మల్చడం. ముఖ్యంగా ఝార్ఖండ్, బీహార్, ఛత్తీస్‌గఢ్, ఒడిషా, ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలలోని అటవీ ప్రాంతాల్లో ప్రభుత్వాలు కార్పొరేట్ కంపెనీలతో వందలాది ఎంవోయూలు కుదుర్చుకొన్నాయి. ఇటీవలే ప్రభుత్వం రావ్‌ఘాట్ గనుల్ని ప్రైవేటీకరణ చేస్తున్నట్టుగా ప్రకటించి విదేశీ పెట్టుబడిదారులకు ఆహ్వానం పలికింది. ఈ దోపిడీ విధానాల అమలులో మావోయిస్టు వుద్యమమే అతి పెద్ద అడ్డంకిగా వున్నందున ఈ వుద్యమాన్ని సమూలంగా నిర్మూలించే లక్ష్యంతో ఈ యుద్ధం ప్రారంభించింది. ఇప్పుడు ఇందులో సైన్యాన్ని దించే ప్రక్రియను ప్రారంభించింది. సైన్యాన్ని 'శిక్షణ' పేరుతోనే దించుతున్నప్పటికీ ప్రజల న్యాయమైన వుద్యమాల్ని అణచడమే దీని లక్ష్యమనే విషయం చిన్న పిల్లలు కూడా అర్థం చేసుకోగలరు.

ఛత్తీస్‌గఢ్‌లో బీజేపీ రమన్‌సింగ్ ప్రభుత్వం ఒకవైపు పోరాడే ప్రజలపై భారీ నిర్బంధకాండను కొనసాగిస్తూనే మరోవైపు ఇందుకు వ్యతిరేకంగా గొంతు విప్పే ప్రతి ఒక్కరినీ అణచివేస్తున్నది. ప్రభుత్వ బలగాల జులుంనూ, సల్వాజుడుం సృష్టిస్తున్న బీభత్సాన్ని ప్రశ్నించినందుకే రమన్ ప్రభుత్వం మానవహక్కుల కార్యకర్త డాక్టర్ బినాయక్ సేన్‌ను దేశద్రోహం కేసులో ఇరికించి యావజ్జీవ శిక్ష విధించింది. ఈ కారణంతోనే హిమాంశు కుమార్‌కు చెందిన వనవాసీ చేతనా ఆశ్రమను కూల్చేసి ఆయనను బస్తర్ నుండే కాకుండా మొత్తం ఛత్తీస్‌గఢ్ నుండే తరిమేసింది. ఆపరేషన్ గ్రీన్‌హంట్‌లో భాగంగా జరుగుతున్న ఆదివాసుల నరమేధాలపై నిజనిర్ధారణ జరపడానికి వచ్చిన ప్రతి బృందాన్నీ అడ్డుకుంది. ఒక మహిళా బృందాన్ని చాలా ఘోరంగా వేధించి వెళ్లగొట్టింది రమన్ ప్రభుత్వం. ఇటీవల చింతల్‌నార్ ప్రాంతంలో ప్రభుత్వ బీభత్సకాండ బారిన పడిన ప్రజలను కలవడం కోసం వెళ్లడానికి ప్రయత్నించిన స్వామి అగ్నివేష్‌ను కొట్టి వెనక్కి పంపించింది. ఛత్తీస్‌గఢ్ హోం మంత్రి ననకీరాం తమ ప్రభుత్వం పీయూసీఎల్ పైననే నిషేధం విధించాలని చూస్తున్నట్టు ప్రకటించాడు. స్వామి అగ్నివేష్‌ను బస్తర్ రానివ్వమని ప్రకటించాడు. ఇక్కడ సాగుతున్న పోలీసు రాజ్యాన్ని అర్థం చేసుకోవాలంటే దంతెవాడ ఎస్ఎస్‌పీగా వుండిన కల్లూరి వుదాహరణ ఒక్కటి సరిపోతుంది. మావోయిస్టుగా చెప్పి ఒక ఆదివాసీ యువకుడిని కాల్చి చంపిన కోయ కమాండో కమాండర్‌కు విలేకరుల సమావేశంలో లక్ష రూపాయల బహుమతి అందజేశాడు. ఒక్కో మావోయిస్టును చంపినందుకు ఇలాగే బహుమతులు ఇస్తానని బరితెగించి ప్రకటించాడు. ఇంకా కనీసం 12 మంది మావోయిస్టుల్ని చంపే దాకా ఉప్పు తినబోనని విలేకరుల సమక్షంలోనే శపథం చేశాడంటే ఇక్కడ సాగుతున్నది ఎలాంటి పాలనో అర్థం చేసుకోవచ్చు!!

ఇక్కడ పోలీసులు ఏది మాట్లాడితే అదే చట్టం! హోంమంత్రి లేదా ముఖ్యమంత్రి ఏది చెబితే అదే రాజ్యాంగం!! 'ప్రజాస్వామ్యం' ఒక క్రూర పరిహాసం ఇక్కడ! పెసా చట్టం, 5వ షెడ్యూలు వంటి చట్టాలు తుంగలో తొక్కబడతాయిక్కడ. కాబట్టి ఈ పరిస్థితులే ప్రజలను ఆత్మరక్షణ కోసం ప్రతిఘటనకు పూనుకునేలా పురికొల్పుతున్నాయి.

పోలీసులకూ, పారామిలిటరీ బలగాలకూ, ఎస్‌పీవోలకూ 'మీరు మా శత్రువులు కాదు' అని మరోసారి విజ్ఞప్తి చేస్తున్నాం. ఈ పోరాటం మీకు వ్యతిరేకంగా కానే కాదు. దోపిడీ వర్గాలు మిమ్మల్ని ముందుంచి ప్రజలపై అన్యాయమైన యుద్ధాన్ని సాగిస్తున్నారు. కనుక మీరు ప్రజలపై దాడులలో, బీభత్సకర సంఘటనల్లో పాలు పంచుకోకండి. అవినీతిపరులూ, కుంభకోణులూ, దోపిడిదొంగలూ, దళారులూ అయిన అసలు శత్రువుల్ని, దేశానికి పట్టిన చీడపురుగుల్ని గుర్తించండని కోరుతున్నాం.

భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ దేశంలోని సమస్త పీడిత ప్రజలకూ, ప్రజాస్వామ్యప్రియులకూ చేసే విజ్ఞప్తి :

- ✶ **ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను వెంటనే ఆపాలని డిమాండ్ చేయండి!**
- ✶ **బస్తర్‌లో సైన్యం మోహరింపునూ, శిక్షణ పేరుతో 750 చదరపు కిలోమీటర్ల భూమిని అప్పగించే ప్రభుత్వ ప్రతిపాదననూ వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేయండి!**
- ✶ **చింతల్‌నార్ ప్రాంతంలో ప్రజలపై అత్యాచారాలకు, గృహదహనాలకు, హత్యలకు పాల్పడ్డ ఎస్ఎస్‌పి కల్లూరి, ఐజీ లాంగ్‌కుమేర్, డిజిపి విశ్వరంజన్ తదితర పోలీసు అధికారులపై, కోయ–కోబ్రా కమాండోలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేయండి!**
- ✶ **జైళ్ళల్లో మగ్గుతున్న ఆదివాసులందరినీ బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేయండి!**

Gudsa Usendi

**(గుడ్సా ఉసెండి)**
**అధికార ప్రతినిధి, దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ,**
**భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)**